# తాతల మూతులు

రెండేళ్ళ క్రితం అనుకుంటాను ఒక మంచి సినిమా చూశాను. దాని పేరు 'మై బిగ్ ఫాట్ గ్రీక్ వెడ్డింగ్'. చాల చక్కటి సినిమా.

అనగా అనగా అమెరికాలో ఒకటో తరం తండ్రి చాటు గ్రీకు కుటుంబం. సాంప్రదాయుడైన తండ్రి. ఆయన కూతురు ఒక అమెరికన్ని ప్రేమిస్తుంది. అతన్నే పెళ్ళి చేసుకుందామని అనుకుంటుంది. తండ్రికి స్వతహాగా ఆ అమ్మాయి ఒక గ్రీకు అతన్నే చేసుకోవాలనే పట్టుదల కథ రకరకాల సన్నివేశాలతో చాల సరదాగా, హాస్యంగా నడుస్తుంది.

ఈ సినిమాలో గ్రీకులని తీసేసి ఇండియన్స్‌ని పెడితే, అది అచ్చం మన కథే అయిపోతుంది. సాంస్కృతికపరంగా కొంచెం మార్పులు చేస్తే, అది మన గురించే అనే అభిప్రాయం తప్పకుండా కలుగుతుంది.

సినిమాలో పిల్ల తండ్రి, ఎవరు ఏ విషయం చెప్పినా అది గ్రీకువాళ్ళ దగ్గర నించే వచ్చిందంటాడు. భాషాపరంగా ఏ ఇంగ్లీషు మాట చెప్పినా దాన్ని ఒక గ్రీకు పదంతో కలిపేసి, దానికి ఆధారం గ్రీకే అని నిశ్చయంగా చెప్పేస్తాడు. అమెరికానే కాదు, ప్రపంచంలో అన్ని దేశాలూ గ్రీకుల దగ్గరినించే అన్నీ కాపీ కొట్టాయంటాడు. గ్రీకులవల్లే అమెరికా ఇంత సౌభాగ్యవంతమైన దేశం అయిందంటాడు. ఆ మాటలు ఎంత దాకా కోటలు దాటుతాయంటే, అసలు గ్రీకుల మీదే ప్రపంచమంతా ఆధార పడిందన్నంతగా చెప్పేస్తుంటాడు. అది ఏదో గర్వంతో చెప్పేది కాదు, నమ్మకంతో చెప్పేది. అందుకనే ఆ రచయితా దర్శకుడూ ఆ కథలో, పాత్రతో ఎంతో హాస్యం రాబట్టగలిగారు.

ఈ సినిమా చూస్తుంటే నాకు ఇద్దరు గుర్తొచ్చారు. మా స్నేహితుడు రత్నం అతని బాబాయి. రత్నం బాబాయి ఇండియానించీ వచ్చాడు. తీసుకు వస్తానంటే సరే కాఫీకి రమ్మన్నాను.

వాళ్ళు వచ్చిన పది నిమిషాల్లోనే ఎవరో పిలిచినట్టు గణపతికూడా వచ్చాడు బాగున్నారా గురువుగారూ అంటూ. గణపతి అమెరికాకి వచ్చి నాలుగైదేళ్ళయిందేమో. సరదాగా మాట్లాడతాడు. అతని మాటల్లో వ్యంగ్యం, హాస్యం కలిసే వుంటాయి. అందువల్ల ఒక్కొక్కప్పుడు ఏదైనా వాదన వచ్చినప్పుడు ఎవరిని సమర్థిస్తున్నాడో చెప్పటమూ కష్టమే. అతని హాస్యం అంటే నాకిష్టం. అందుకే అతను వచ్చినప్పుడల్లా నాకూ బాగానే వుంటుంది. రత్నం గోదావరి బ్రిడ్జి మీద వెళ్ళే సూపర్ ఫాస్ట్ రైల్లో

స్లీపర్ కోచ్‌లో నిద్ర పోతున్న పాసెంజర్ అయితే, బాబాయి బ్రిడ్జ్ క్రింద పరుగులు పెడతున్న గోదావరి లాటివాడు. చకచకా రకరకాల విషయాల మీద అనర్గళంగా మాట్లాడేస్తున్నాడు. నేను వింటూ తల వూపుతున్నాను. రత్నానికి స్లీపర్ కోచ్‌లో వున్నట్టుందేమో, కూర్చునే కునికిపాట్లు పడుతున్నాడు.

బాబాయి అమెరికా వచ్చి పది రోజులయిందిట. అంత తక్కువ రోజుల్లోనే అమెరికా సంస్కృతినీ, ప్రజల జీవన విధానాన్నీ, సాంకేతిక పరిజ్ఞానాన్నీ అవపోసన పట్టేసినట్టు చెప్పేస్తున్నాడు.

'ఇండియానించి మీ ప్రయాణం బాగా జరిగిందా?' అని అడిగాను.

'బాగానే అయింది. కాకపోతే అన్ని గంటలు కూర్చోవటమే కష్టమయింది' అన్నాడు.

ఒక్క క్షణం ఆగి 'అసలు విమానాలు కనిపెట్టింది అమెరికా కాదు. పుష్పక విమానాలు ఏనాటినించో మనకి వున్నాయి. వెధవలు మనకి చెప్పకుండా కాపీ కొట్టేసి, వాళ్ళే కనిపెట్టేసినట్టు పోజు కొడుతున్నారు' అన్నాడు.

రత్నం బాబాయి మాట్లాడుతుంటే నాకు గ్రీక్ వెడ్డింగ్ సినిమానే గుర్తుకి వచ్చింది. వినటానికి సరదాగా వుంది.

'మీరు ఈ దేశానికి వచ్చేటప్పుడు దేంట్లో వచ్చారు పుష్పక విమానమా? బోయింగా? బాబాయిగారూ' అడిగాడు గణపతి.

ఆయన గణపతిని వింతగా చూశాడు.

గణపతి నవ్వుతూ అన్నాడు - 'ఏం లేదు, నేను అమెరికా వచ్చినప్పుడే మొదటిసారిగా విమానం ఎక్కింది. మా అమ్మమ్మ చెప్పింది, విమానంలో ఎక్కినప్పుడు చేతులు బయటికి పెట్టొద్దురా, గద్దలూ రాబందులూ వుంటాయని. నా చిన్నప్పుడు తెలుగు సినిమాల్లో కాంతారావు నారదుడి వేషంలో, మేఘాల మీద అలా ఆఘమేఘాల మీద వెడుతుంటే వింతగా చూసేవాడిని. మా విమానం బొంబాయిలో బయల్దేరి ఆకాశంలోకి వెళ్ళగానే, కిటికీలోనించి బయటికి మేఘాల్లోకి చూశాను. కాంతారావ్ కోసం కాదు. నిజం నారదుడి కోసం. అప్పట్నించీ ఇప్పటిదాకా, అదేమిటో నాకదో అలవాటయి పోయింది. ఇంతవరకూ నారదుడు కనపడలేదు'

బాబాయి నవ్వు రాకపోయినా, చిరునవ్వి అన్నాడు. 'నేను ఈమధ్య రిటైర్ అయాక చాల పరిశోధన చేశాను. ఈనాడు అమెరికా సాంకేతికంగా గొప్పలు చెప్పుకుంటున్నవన్నీ మనవాళ్ళు ఏనాడో చెప్పారు. ఇంద్రధనుస్సులో ఏడు రంగులు వున్నాయని ఋగ్వేదంలో వుంది. స్త్రీ గర్భంలో నించే పిల్లలు పుట్టక్కర్లేదని - అంటే టెస్ట్ ట్యూబ్ బేబీస్ - భారతంలో ఏనాడో వుంది. వీళ్ళేదో నదుల మీద బ్రిడ్జిలు కట్టి గొప్పలు చెప్పుకుంటున్నారు. రామాయణంలో సముద్రం మీద రామేశ్వరం నించి శ్రీలంక దాకా ఆనాడే వారధి కట్టారు'

'అవును. నేను సివిల్ ఇంజనీరింగ్‌లో ఎమ్మెస్ చేసేటప్పుడు చదువు కున్నాను. స్ట్రెస్ ఎనాలిసిస్ అదీ.. సుగ్రీవుడూ వాలీ ఎలా ... ' అనబోతున్న గణపతి ఆగాడు, అప్పుడే వేడివేడి ఉల్లిపాయ పకోడీలూ కాఫీ తెచ్చి శ్రీమతి అక్కడ బల్ల

మీద పెట్టటం చూసి.

'నాకు పకోడీలు ఇష్టమని మీకు తెలుసని నాకు తెలుసు' అన్నాడు గణపతి నవ్వుతూ. పకోడీ వాసనకి కళ్ళు తెరిచాడు రత్నం.

బాబాయిగారు పకోడీలు నోట్లో వేసుకుని నములుతూ 'ఇంకో విషయం మీకు చెప్పాలి. ఆటంబాంబు అమెరికా వాడు కనిపెట్టాడని అందరూ అనుకుంటు న్నారు కదూ. కానే కాదు. క్రీ.పూ. 5500లో మహాభారతంలో స్పష్టంగా వ్రాసి వుంది అది మనవాళ్ళు ఆనాడే కనిపెట్టారని. దానిపేరు బ్రహ్మాస్త్రం' అన్నాడు.

'బాబాయ్! మళ్ళీ మొదలుపెట్టావూ. ఇందాకటినించీ ఏదో కునుకుపట్టింది కానీ, నువ్విలా పంచాంగం విప్పుతావనుకోలేదు... ' అన్నాడు రత్నం.

'దాందేముంది. ఆయనకి తెలిసినవి ఆయన చెబుతున్నారు' అన్నాను చిరునవ్వుతో.

'అలా చెప్పండి వీడికి. అమెరికా రాగానే, ఇక్కడ పుస్తకాలు చదివి మన పూర్వీకుల గొప్పతనమేమిటో పూర్తిగా మరిచిపోయాడు. వీడు ఈరోజు స్పేస్ సెంటర్‌లో పనిచేస్తునాడు కానీ, మనకి ఈగ్రహాల గురించి ఏనాడో తెలుసు. చంద్రుడి గురించి తెలుసుకోటానికి చంద్రమండలం వెళ్ళక్కర్లేదు. మనకవన్నీ ఏనాడో తెలుసు. అసలమెరికావాడు అక్కడికి వెళ్ళలేదుట. స్టూడియోలో సినిమా తీసి, చంద్ర మండలం మీద దిగినట్టుగా టీవీలో చూపించారుట'

గణపతి నవ్వుతూ అన్నాడు 'అవును నేనూ చూశాను ఆ షో టీవీలో. దాన్ని తరువాత సీరియల్‌లాగా 496 ఎపిసోడ్లు వేశారు'

ఆయన గణపతిని వింతగా చూశాడు, ఇతను సీరియస్‌గా అంటున్నాడో ఆట పట్టిస్తున్నాడో అర్థంకాక.

ఆయన నొచ్చుకున్నాడేమో అని అనుమానం వచ్చి, గణపతి అన్నాడు 'నేనేదో సరదాగా అన్నాను బాబాయిగారూ. మనవాళ్ళేం తక్కువ తినలేదు. మనకీ రామానుజం వున్నాడు. భాస్కర, ఆర్యభట్ట, సివి రామన్‌లు వున్నారు. చంద్రశేఖర్, హర్‌గోబింద్ ఖురానా, అమార్త్యా సేన్‌లు వున్నారు. భాభా, సారాభాయ్, సేత్నా, కలామ్‌లు వున్నారు. ఉపగ్రహాలూ తయారు చేయగలం. అణుశక్తినీ అరిచేతిలో పెట్టుకున్నాం' అంటున్నప్పుడు బాబాయి మా అందరివేపూ గర్వంగా చూశాడు.

మళ్ళీ అన్నాడు గణపతి 'అంతేకాదు బాబాయిగారూ, మన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకి ప్రపంచంలో ఎవరూ సాటిలేరు'

బాబాయిగారు ఉత్సాహంతో 'అవును. అసలు సాఫ్ట్‌వేర్‌లో మనం లేకపోతే అమెరికాయే లేదు. అంతేకాదు ఎలెక్ట్రిసిటీ కనిపెట్టింది కూడా మనమే' అంటూ ఇంకో పకోడీ ఎగరేసి నోట్లో వేసుకున్నాడు.

పక్కనే వున్న రత్నం - 'బాబాయ్! ఏమిటి పకోడీలు నేతితో చేశారా... నీ మూతి నేతి వాసన వేస్తోంది' అన్నాడు.

బాబాయికి అతని మాటలు అర్థంకాక అదోలా చూశాడు.

0 0 0